www.vishalabharati.com
epaper.vishalabharati.com

శనివారం, హైదరాబాద్
18 అక్టోబర్ 2025
సంపుటి:3 సంచిక: 290

# విశాల భారతి

తెలుగు దినపత్రిక




# నవీన్ యాదవ్ రాజకీయ ప్రస్థానం



## జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు





- జూబ్లీహిల్స్ నుంచి రెండు సార్లు పోటీ
- మజ్లిస్ తరఫున పోటీ చేసి ఓటమి
- 2009 నుంచి రాజకీయాల్లో
- ప్రస్తుతం రాజకీయంతో పాటు వ్యాపారం
- చిన్న శ్రీశైలం యాదవ్ కుమారుడు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో :**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్‌కు లైన్ క్లియర్ అయ్యింది. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా నవీన్ యాదవ్ పేరును ఏఐసీసీ ఖరారు చేసింది. అయితే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను అధికార కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ ఉప ఎన్నికలో ఎలాగైనా గెలుపు సాధించాలనే పట్టుదలతో ఉంది. ఇందుకోసమే ఎన్నికల బరిలో బలమైన అభ్యర్థిని దించాలని నిర్ణయించుకుంది. ఇందులో భాగంగానే సుదీర్ఘ చర్చల తర్వాత కాంగ్రెస్ అధిష్టానం నవీన్ యాదవ్ పేరును ఖరారు చేసినట్టు తెలుస్తోంది.

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్ పేరు ఖరారైంది. ఏఐసీసీ ఆయన పేరును అధికారికంగా ప్రకటించింది. నవంబరు 11న జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి ఉపఎన్నిక జరగనుంది. ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మృతితో జూబ్లీహిల్స్ ఉపఎన్నిక అనివార్యమైంది. మరి ఈ సీటును దక్కించుకునేందుకు ప్రధాన పార్టీల వ్యూహాలు ఎలా ఉన్నాయి. తమ స్థానాన్ని చేజిక్కించుకునేందుకు మిగతా పార్టీల కంటే ముందే అభ్యర్థిని ప్రకటించింది బీఆర్ఎస్. గోపినాథ్ భార్య సునీతను బరిలోకి దింపింది. బీజేపీ అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డిని రంగంలోకి దింపింది.


అయితే అధికార పార్టీలో అభ్యర్థుల మధ్య పోటీ ఎక్కువగా ఉండటంతో బంతి అధిష్టానం గూటికి చేరింది. దీంతో అభ్యర్థి ఎంపికపై పూర్తిస్థాయి కసరత్తు చేసిన కాంగ్రెస్ అధిష్టానం నవీన్ యాదవ్ పేరును ఖరారు చేసింది.

మిగతా 2లో..

# బీసీ బంద్

- బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అంశం
- నేడు రాష్ట్ర వ్యాప్తంగా బంద్‌కు పిలుపు
- ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్‌లో కీలక సమావేశం
- స్వచ్ఛందంగా బంద్ పాటించాలని కోరారు
- రాష్ట్రంలో అత్యంత ఆసక్తికరంగా మారింది
- రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి కీలక ఆదేశాలు
- మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు



**స్టేట్ బ్యూరో, విశాలభారతి:**

బీసీ వర్గాల హక్కుల సాధన కోసం, 42 శాతం రిజర్వేషన్ల చట్టబద్ధత డిమాండ్‌తో శనివారం తలపెట్టిన బంద్‌కు జిల్లా కేంద్రం సిద్ధమవుతోంది. బీసీ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు ఈ బంద్‌ను చారిత్రక విజయంగా మార్చాలని పిలుపునిచ్చారు, ఈ నిర్ణయం జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన కీలక సమావేశంలో, ఐక్య కార్యాచరణ ప్రతినిధులు బంద్ విజయవంతం కావాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బీసీ వర్గాల న్యాయమైన వాటా కోసం సాగుతున్న ఈ పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. 42 శాతం రిజర్వేషన్ల చట్టబద్ధత అనేది కేవలం ఒక వర్గానికి సంబంధించినది కాదు;

మిగతా 2లో..

# సింగరేణి కార్మికులకు డబుల్ ధమాకా



- సింగరేణి కార్మికులకు గుడ్ న్యూస్
- ఖాతాలో రూ. 1.03 లక్షల బోనస్
- నవంబర్ 11న భూముల వేలం
- గతేడాదితో పోలిస్తే రూ.9,250 పెంపు
- రాష్ట్ర ప్రభుత్వం రూ.819 కోట్లు
- 41,000 మంది శాశ్వత ఉద్యోగులు
- బీమా కవరేజ్ కోటి రూపాయలకు పెంపు

**స్టేట్ బ్యూరో, విశాలభారతి:**

సింగరేణి, కోల్ ఇండియా కార్మికులకు దీపావళి పండుగల వేళ డబుల్ ధమాకా తగిలింది. ఇటీవలే దసరా సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి భారీ బోనస్ అందుకున్న కార్మికులకు తాజాగా కేంద్ర ప్రభుత్వం భారీ మొత్తంలో బోనస్ అందించింది.కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పర్ఫామెన్స్ లింక్డ్ రివార్డు (పీఎల్ఆర్) కింద ఒక్కో కార్మికుడి ఖాతాలో రూ. 1.03 లక్షల బోనస్ జమ చేసింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన కోల్ ఇండియా ప్రతీ ఏడాది ఈ పీఎల్ఆర్ బోనస్ అందిస్తుంది. అయితే ఈ ఏడాది అది రికార్డు స్థాయిలో అందించింది. గతేడాదితో పోలిస్తే రూ.9,250 పెంచి జమ చేసింది. దీంతో ఒక్కొక్కరికి రూ. 1.03 లక్షలు జమ అయ్యాయి. కోల్ ఇండియా

మిగతా 2లో..



# ప్రతి మండలానికి సర్వేయర్లు

- ప్రభుత్వం మరో మార్పునకు శ్రీకారం
- భూ పంచాయతీలకు శాశ్వత పరిష్కారం
- గ్రామ రెవెన్యూ వ్యవస్థను బలోపేతం
- ఈనెల 19న సర్వేయర్లకు లైసెన్స్‌లు
- సీఎం చేతులు మీదగా అందజేత
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- 40 రోజుల పాటు అప్రెంటిస్ శిక్షణ

2

# బంద్‌కు ప్రధాన కారణం బీజేపీనే



- స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడారు
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి
- సైంటిఫిక్‌గా తెలంగాణలో కులగణన
- బిల్లును కేంద్ర ప్రభుత్వం అడ్డుకట్ట
- బీజేపీ బంద్‌కు మద్దతు ఇవ్వలేదు
- కిషన్ రెడ్డి, బండిసంజయ్‌లపై విమర్శలు

2

# కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడులు



- విద్యాశాఖ సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి
- అధికారులకు సీఎం పలు సూచనలు
- కార్పొరేట్ స్కూల్ తరహాలో తీర్చిదిద్దాలి
- మెరుగైన వసతుల కల్పనకు ప్రణాళికలు

2

# రేవంత్ క్యాబినెట్ దండుపాళ్యం ముఠా

- తన్నీరు హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు
- రేవంత్ రెడ్డి హయాంలో గన్ కల్చర్
- ఓ మంత్రి కుటుంబ సభ్యులే ఆరోపణలు
- కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ
- సీఎం తమ్ముళ్ల కోసం ఫైల్స్ ఆపుతున్నారు
- కాంగ్రెస్, బీజేపీ మధ్య అక్రమ సంబంధం
- అవినీతి వాటాల కోసం కొట్లాట



**స్టేట్ బ్యూరో, విశాలభారతి:**

రేవంత్ రెడ్డి హయాంలో తెలంగాణకు గన్ కల్చర్ వచ్చిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిపై కేబినెట్ మంత్రి కుటుంబ

మిగతా 2లో..

# నవీన్ యాదవ్ రాజకీయ ప్రస్థానం





(మొదటిపేజీ తరువాయి)

సర్వే ఆధారంగా ముగ్గురు అభ్యర్థులను షార్ట్ లిస్ట్ చేశారు ఇంచార్జ్ మంత్రులు. రాష్ట్ర నాయకత్వం నవీన్ యాదవ్, బొంతు రాంమోహన్, సీఎన్ రెడ్డి పేర్లు అధిష్టానికి పంపినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మరోవైపు తాను కూడా టికెట్ రేసులో ఉన్నానంటున్నారు అంజన్ కుమార్ యాదవ్. ఇక కాంగ్రెస్ నేత నవీన్ యాదవ్‌కు అవకాశం లభించింది. నవీన్ యాదవ్ ఆ ఎన్నికల్లో ఎంఐఎం తరఫున పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరి, తాజాగా టికెట్ దక్కించుకున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై గల్లీ టు ఢిల్లీ స్పెషల్ ఫోకస్ పెట్టింది అధికార పార్టీ. ఎలాగైనా ఈ సీటును దక్కించుకోకపోతే.. ఆ ప్రభావం మున్ముందు కూడా ఉంటుందన్న అంచనాలతో గట్టిగా పాగా వేసింది కాంగ్రెస్. ముగ్గురు మంత్రులకు ఈ గెలుపు బాధ్యత అప్పగించారు ముఖ్యమంత్రి రేవంత్. ఈ నేపథ్యంలో ఈ యంగ్ లీడర్ ఎవరే చర్చ మొదలైంది జనాల్లో.. పూర్తి పేరు వల్లాల నవీన్‌యాదవ్ (42). ఈయన వి చిన్న శ్రీశైలం యాదవ్ కుమారుడు. బీ.ఆర్క్ (ఆర్కిటెక్చర్) చదివిన నవీన్ యాదవ్ ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడలో నివాసం ఉంటున్నారు. ఈయనకు భార్య, కుమారుడు ఉన్నారు. నవ యువ ఫౌండేషన్‌ను స్థాపించి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నవీన్ యాదవ్ ఇప్పటికే జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి రెండు సార్లు పోటీ చేసి ఓడిపోయారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత.. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో మజ్లిస్ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. 41,656 ఓట్లు సాధించి రెండో స్థానంతో సరిపెట్టుకున్నారు. 2018లో అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. కానీ ఈసారి కేవలం 18,817 ఓట్లతో సరిపెట్టుకున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కానీ పార్టీ టికెట్ ఇవ్వలేదు. ఇక ఇటీవల సిట్టింగ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతితో ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో టికెట్ రేసులో ప్రధానంగా నిలిచారు నవీన్ యాదవ్. అనుకున్నట్టే చిరవకు నవీన్‌నే పార్టీ ఎంపిక చేసింది.

ఈ ఉప ఎన్నికలకు మజ్లిస్ దూరం ఉన్నారు. దీంతో వారు కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. అంతేకాకుండా.. ఎంఐఎమ్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ కూడా యువనేతను ఎంపిక చేయాలని పిలుపునిచ్చారు. దీనికి తోడు బీఆర్ఎస్‌పై విమర్శలు గుప్పించారు. దీంతో మజ్లిస్ కూడా పరోక్షంగా కాంగ్రెస్‌కు సపోర్ట్ ఇస్తున్నట్లు అర్థమవుతోంది. నవీన్ అభ్యర్థిత్వం ఖరారు చేసే విషయంలో కూడా మజ్లిస్ పాత్ర ఉందనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. అందుకే హేమాహేమీలను పక్కన పెట్టి.. యువకుడికి అవకాశం ఇచ్చినట్లు తెలుస్తోంది. నవీన్ యాదవ్ 2009 నుంచి రాజకీయాల్లో యాక్టివ్‌గా ఉన్నారు. కార్పొరేటర్, అసెంబ్లీ స్థానాలకు పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2009లో యూసుఫ్‌గూడ డివిజన్ ఎంఐఎం పార్టీ నుంచి కార్పొరేటర్‌గా, 2014లో ఎంఐఎం తరఫున జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా, 2015లో ఎంఐఎం అభ్యర్థిగా రహ్మత్‌నగర్ డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా, 2018లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. దీంతో ఈసారైనా నవీన్ యాదవ్ గెలుస్తారా అనేది ఆసక్తిగా మారింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. శుక్రవారం కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి పాల్గొన్నారు. నవీన్ యాదవ్ యూసుఫ్‌



గూడ నుంచి నామినేషన్ వేయడానికి భారీ ర్యాలీగా వెళ్లారు. ర్యాలీకి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు, ఇతర ముఖ్య నేతలు తరలివచ్చారు.

# సింగరేణి కార్మికులకు డబుల్ ధమాకా

(మొదటిపేజీ తరువాయి)

చరిత్రలోనే కార్మికులకు ఇంత భారీ మొత్తంలో పీఎల్ఆర్ బోనస్ ప్రకటించడం ఇదే ప్రథమం కావడం విశేషం. 201011 ఆర్థిక సంవత్సరంలో కేవలం రూ.21,000గా ఉన్న ఈ బోనస్ ప్రస్తుతం లక్ష రూపాయలు దాటింది. ఈ బోనస్‌తో సింగరేణి కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సింగరేణి కార్మికులకు తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఇటీవలే దసరా బోనస్ ప్రకటించిన సంగతి తెలిసిందే. గతేడాది సింగరేణి సంస్థ ఉత్పత్తి, గడించిన లాభాల ఆధారంగా బోనస్‌ను ప్రకటించింది. ఈ బోనస్ వల్ల రెగ్యులర్ కార్మికులకు రూ.1,95,610 చొప్పున బోనస్ రూపంలో లబ్ధి చేకూరింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.819 కోట్లున విడుదల చేసింది. గత ఏడాది రూ.796 కోట్లు విడుదల చేస్తే ఈ ఏడాది దానికి అధికంగా ఏకంగా రూ.819 కోట్లు విడుదల చేసింది. జే.బీ.సీ.సీ.ఐ. విధానాల్లో భాగంగా కంపెనీలు సాధించిన ఉత్పత్తి పరిమాణం ఆధారంగా కార్మికుల శ్రమకు ప్రోత్సాహకంగా ఈ బోనస్‌ను చెల్లించే పద్ధతి గత కొన్నేళ్లుగా అమలులో ఉంటోంది. ఈ ఏడాది కూడా కోల్ ఇండియా స్థాయిలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా దసరా పండుగకు బోనస్ చెల్లించింది. ఇలా సింగరేణి, కోల్ ఇండియా కార్మికులు నెల రోజుల వ్యవధిలోనే రెండు భారీ బోనస్‌లు అందుకున్నారు. దీంతో కార్మికుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. దసరా పండుగ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం సంస్థ లాభాల్లో 34 శాతం వాటాను కార్మికులకు పంచాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం మేరకు 41,000 మంది శాశ్వత ఉద్యోగులకు ఒక్కొక్కరికి రూ. 1.95 లక్షలకు పైగా దసరా బోనస్‌గా అందింది. తాజాగా కేంద్ర ప్రభుత్వం పీఎల్ఆర్ బోనస్ కింద మరో లక్షరూపాయలు నగదు అందజేసింది. దీంతో సింగరేణి, కోల్ ఇడియా కార్మికులు ఈ ఏడాది దీపావళి పండుగను మరింత ఉత్సాహంగా జరుపుకోనున్నారు. ఇకపోతే కోల్ ఇండియా లిమిటెడ్, దాని అనుబంధ సంస్థలు, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌లోని కార్మికులకు పనితీరు ఆధారిత రివార్డు అందజేయనున్నట్టుగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇటీవలే ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రతి కార్మికుడికి వారి అంకితభావం, అలుపెరుగని కృషికి గుర్తింపుగా రూ. 1,03,000 రివార్డు అందుకుంటారని ప్రకటించారు. దసరా పర్వదినం సందర్భంగా ఈ మేరకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఎక్స్ వేదికగా వివరాలు వెల్లడించిన సంగతి తెలిసిందే. కోల్ ఇండియా లిమిటెడ్ స్వర్ణోత్సవ సంవత్సరంలో కోల్ ఇండియా లిమిటెడ్, దాని అనుబంధ సంస్థలు, సింగరేణి కాలరీస్ లిమిటెడ్ కార్మికులకు దసరా, దీపావళి, ఛత్ పూజ వంటి రాబోయే పండుగలకు పెర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డ్స్ (పీఎల్ఆర్) ఆమోదించబడిందని ప్రకటించడానికి యాజమాన్యం సంతోషంగా ఉందని కిషన్ రెడ్డి తెలిపారు. కార్మికుల నిరంతర ప్రయత్నాలు, కృషికి గుర్తింపు, ప్రశంస, కృతజ్ఞతగా... కోల్ ఇండియా , దాని అనుబంధ సంస్థలకు చెందిన 2.09 లక్షల మంది కార్మికులకు, అలాగే సింగరేణి కాలరీస్‌లోని 38,000 మంది కార్మికులకు ఒక్కొక్కరికి రూ. 1,03,000 చొప్పున అందించబడుతుంది అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి నాడు ప్రకటించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దార్శనిక నాయకత్వంలో కార్మికుల సంక్షేమం తమ ప్రధాన ప్రాధాన్యత అని వెల్లడించారు. మోడీ నాయకత్వం, మార్గదర్శకత్వంలో బొగ్గు రంగం ఉత్పత్తి, సామర్థ్యంలో కొత్త ప్రమాణాలను నిర్దేశించడమే కాకుండా... పీఎస్‌యూలలో ఉద్యోగుల సంక్షేమంలో అపూర్వమైన చర్యలు తీసుకున్నట్టుగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. మొత్తానికికోల్ ఇండియా నుంచి వచ్చే పీఎల్ఆర్ బోనస్‌ను దీపావళికి పంపిణీ చేస్తామని ప్రభుత్వం ముందుగా ప్రకటించిన ప్రకారమే.. శుక్రవారం ఆ మొత్తాన్ని ఖాతాల్లో జమ చేసింది. ఇకపోతే సింగరేణి కార్మికులకు ఎటువంటి ప్రీమియం చెల్లించకుండానే మెరుగైన బీమా కవరేజ్ అందిస్తుంది. ఉద్యోగులకు బీమా కవరేజ్ రూ. 1 కోటి వరకు పెంచింది. ఇది కుటుంబాలకు బలమైన ఆర్థిక భద్రతను కల్పిస్తుంది. శాశ్వత ఉద్యోగులు కానివారికి కూడా బీమా రక్షణ కల్పించింది. కోల్ ఇండియా లిమిటెడ్, దాని అనుబంధ సంస్థలలో సీఎండీ నుంచి కార్మికుడి వరకు యూనిఫాం డ్రెస్ కోడ్‌ను సైతం ప్రవేశపెట్టింది. ఈ డ్రెస్ కోడ్ కోల్ పరివార్‌లో సమానత్వం, ఐక్యత, ఒకే గుర్తింపును సూచిస్తుంది.అలాగే కార్మికులకు ఎక్స్‌గ్రేషియా పరిహారం రూ. 15 లక్షల నుంచి రూ. 25 లక్షలకు పెంచబడింది.

# బీసీ బంద్

(మొదటిపేజీ తరువాయి)

సామాజిక న్యాయం, సమానత్వం కోసం జరుగుతున్న పోరాటం" అని ఉద్ఘాటించారు. బంద్‌కు సంపూర్ణ మద్దతు కూడగట్టేందుకు బీసీ సంఘాల ప్రతినిధులు చురుగ్గా పర్యటించారు. వారు చాంబర్ ఆఫ్ కామర్స్, కిరాణా వర్తక సంఘం వంటి వ్యాపార సంస్థల ప్రతినిధులను కలిసి, స్వచ్ఛందంగా బంద్ పాటించాలని కోరారు. ముఖ్యంగా వ్యాపార, వాణిజ్య సంస్థలు,విద్యా సంస్థలు, తప్పకుండా బంద్ పాటించి, బీసీల గళానికి బలం చేకూర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశానికి ఎస్సీ, ఎస్టీ , అంబేద్కర్ సంఘాల ప్రతినిధులు హాజరై, ఈ రిజర్వేషన్ల పోరాటానికి పూర్తి మద్దతు ప్రకటించడం ఈ ఉద్యమ బలాన్ని మరింత పెంచింది. రిజర్వేషన్ల చట్టబద్ధత కోసం జరిగే ఈ పోరాటం జిల్లా రాజకీయ, సామాజిక వాతావరణంలో వేడిని పెంచింది. శనివారం తలపెట్టిన బంద్ ఏ స్థాయిలో విజయవంతమవుతుంది, ప్రభుత్వం ఈ డిమాండ్‌పై ఎలా స్పందిస్తుంది అనేది ప్రస్తుతం రాష్ట్రంలో అత్యంత ఆసక్తికరంగా మారింది. బీసీ వర్గాల ఐక్యతకు ఈ బంద్ ఒక శక్తిమంతమైన వేదికగా నిలవనుంది. అయితే తెలంగాణ బంద్ నేపథ్యంలో రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 18వ తేదీన వివిధ పార్టీలు తలపెట్టిన బంద్ కార్యక్రమాన్ని శాంతియుతంగా జరుపుకోవాలని స్పష్టం చేశారు. బంద్ పేరుతో అవాంఛనీయ సంఘటనలకు గానీ, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు గానీ పాల్పడినట్లయితే చట్టం ప్రకారం కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

బంద్‌కు సంబంధించిన పరిస్థితులను పోలీస్ సిబ్బంది, నిఘా బృందాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాయని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. బంద్ సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. సాధారణ ప్రజలకు సమస్యలు ఎదురవకుండా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డీజీపీ స్పష్టం చేశారు. ఇక, అక్టోబర్ 18న బీసీ సంఘాల జేఏసీ తలపెట్టిన తెలంగాణ బంద్‌కు ఇప్పటికే పలు ప్రధాన రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించిన సంగతి తెలిసిందే.

తెలంగాణలో అధికార కాంగ్రెస్ కూడా రాష్ట్రవ్యాప్తంగా బంద్‌నకు మద్దతిచ్చింది. బీజేపీ ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య నేతృత్వంలోని బీసీ నాయకుల ప్రతినిధి బృందం గాంధీ భవన్‌లో టీపీసీసీ మహేష్ గౌడ్‌ను కలిసి బంద్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. సానుకూలంగా స్పందించిన టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్.. బంద్‌కు కాంగ్రెస్ పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ..తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి పూర్తిగా కట్టుబడి ఉందని తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గదని ఆయన అన్నారు.

# బంద్‌కు ప్రధాన కారణం బీజేపీనే

స్టేట్ బ్యూరో, విశాలభారతి:




కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల ప్రకారం స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు దేశంలో ఎక్కడా లేని విధంగా చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. తొలిసారిగా సైంటిఫిక్‌గా తెలంగాణలో కులగణన నిర్వహించామని.. సర్వే ద్వారా వచ్చిన సమాచారంతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని చూసినట్లు తెలిపారు. చట్ట సభల్లో ఏకగ్రీవాగంగా ప్రవేశ పెట్టామని.. గవర్నర్, రాష్ట్రపతికి పంపించినట్లు తెలిపారు. అయితే తాము పాస్ చేసిన బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించకుండా అడ్డుకట్ట వేసి రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లకు అడ్డుపడుతోందని ఆరోపించారు. ఇది బీజేపీ ప్రభుత్వం నిరంకుశ పాలనకు నిదర్శనమని మండిపడ్డారు భట్టి.

ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర కాంగ్రెస్ పార్టీ బీసీ రిజర్వేషన్లపై ధర్నా చేశామని.. బీజేపీ పార్టీ తప్ప అన్ని రాజకీయ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారని అన్నారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లు పాస్ చేయడమే కాకుండా న్యాయ స్థానాలకు కూడా వెళ్తోందన్నారు. ఓబీసీపై సుప్రీం కోర్టులో ప్రముఖ న్యాయవాదులు పోరాడుతున్నారని తెలిపారు. కేవలం రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లును కేంద్రం పార్లమెంట్‌లో పెట్టకపోవడం వల్లే... ఓబీసీలకు 42శాతం రిజర్వేషన్ కష్టమని సుప్రీం కోర్టు చెప్పే పరిస్థితి వచ్చిందన్నారు. బీజేపీ పార్టీ వల్లనే బీసీ రిజర్వేషన్ల అంశం ఇంకా పెండింగ్‌లో ఉందన్నారు. దీని వల్ల రాష్ట్రంలో ఓబీసీ సంఘాలన్నీ కూడా రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయన్నారు. శనివారం జరిగే ఓబీసీ బంద్‌కు ప్రధాన కారణం బీజేపీ అని అన్నారు. ఓబీసీల బంద్‌లో అన్ని పార్టీల సంఘాలు ఆమోదం తెలిపాయని డిప్యూటీ సీఎం వెల్లడించారు.

ఓబీసీ బిల్లుపై ఎందుకు మొండి వైఖరి చూపిస్తున్నారని కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండిసంజయ్‌లను ప్రశ్నించారు. ప్రధానితో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ఓబీసీ బిల్లును ఎందుకు పాస్ చేయించడం లేదని నిలదీశారు. బిల్లులకు అడ్డుపడుతూ మళ్ళీ కాంగ్రెస్ పార్టీ మీద బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఒక్క బీసీలే కాదు అన్ని వర్గాల ప్రజలు కూడా.. బీజేపీకి తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. బీజేపీ చేస్తున్న ఆగడాలను అందరూ గమనిస్తున్నారని.. కమలం పార్టీ విధానాలకు వ్యతిరేకంగా రేపు బంద్ జరుగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు.

కాగా.. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు డిప్యూటీ సీఎం. సింగరేణి కార్మికులకు దీపావళికి 400 కోట్ల రూపాయల బోనస్ చెల్లిస్తున్నామని ప్రకటించారు. సింగరేణి ఖమ్మం జిల్లా నుండే మొదలైందని.. ఇక్కడ మొదలై రాష్ట్రం అంతటా వ్యాపించిందన్నారు. సింగరేణి కార్మికులకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.

# కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడులు

- విద్యాశాఖ సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి
- అధికారులకు సీఎం పలు సూచనలు
- కార్పొరేట్ స్కూల్ తరహాలో తీర్చిదిద్దాలి
- మెరుగైన వసతుల కల్పనకు ప్రణాళికలు
- తొలి దశలో ఔటర్ రింగురోడ్డు లోపల
- మంచి వాతావరణం ఉండేలా చూడాలి
- నర్సరీ- 4 వ తరగతి వరకు కొత్త స్కూల్స్

స్టేట్ బ్యూరో:



ప్రతీ ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ స్కూల్ తరహాలో తీర్చిదిద్దాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం, అక్టోబర్ 17వ తేదీన విద్యాశాఖ సమీక్షలో అధికారులకు సీఎం రేవంత్ పలు సూచనలు చేశారు. ' పేదలకు మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతుల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయండి. తొలి దశలో ఔటర్ రింగురోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్ పై దృష్టి సారించండి. ప్రతీ ప్రభుత్వ పాఠశాల కార్పొరేట్ స్కూల్ తరహాలో తీర్చిదిద్దాలి. ప్లే గ్రౌండ్, అవసరమైన తరగతి గదులతోపాటు మంచి వాతావరణం ఉండేలా చూడాలి. ఇందుకు విద్యా శాఖ పరిధిలో ఉన్న స్థలాలను గుర్తించండి సరైన సౌకర్యాలు లేని పాఠశాలలను దగ్గరలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలానికి తరలించండి. నర్సరీ నుంచి 4 వ తరగతి వరకు నూతన స్కూల్స్ ను పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలి. అక్కడ కార్పొరేట్ స్కూల్ స్థాయిలో అన్ని వసతులతో విద్యను అందించే ఏర్పాటు చేయండి విద్యార్థులకు పాలు, బ్రేక్ ఫాస్ట్, లంచ్ అందించేలా ప్రణాళికలు సిద్ధం చేయండి 2026 జూన్ లో అకడమిక్ ఇయర్ నుంచి అమలు జరిగేలా యాక్షన్ ప్లాన్‌తో ముందుకెళ్లాలి' అని సీఎం రేవంత్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్యా రంగాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. 78 యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలల కాంప్లెక్సులను నిర్మించేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రతీ కాంప్లెక్స్ నిర్మాణం కోసం రూ.200 కోట్లు ఖర్చు చేయనుంది, దీంతో మొత్తం రూ.15,600 కోట్లు ఖర్చు చేయడానికి ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఆర్థిక శాఖ అనుమతులు ఇచ్చేందుకు అంగీకరించింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ద్వారా, సీఎం రేవంత్ రెడ్డి కార్యాలయానికి విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి యంగ్ ఇండియా గురుకుల స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణాల ఫైల్ పంపించారు. ఈ నిర్మాణ ప్రతిపాదనల్ని తెలంగాణ మంత్రిమండలి ఆమోదించింది.

202526 ఏడాదికి వెయ్యి పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించేందుకు తెలంగాణ మంత్రిమండలి ఆమోదం తెలిపింది. గత సంవత్సరంలో 250 పాఠశాలల్లో ఈ తరగతులు ప్రారంభించగా, ఈ ఏడాది మరో 210 పాఠశాలల్లో విస్తరించాయి. మొత్తం పాఠశాలల సంఖ్య 460కి చేరుకుంది. అదనంగా పీఎంశ్రీ పథకంలో 112 పాఠశాలలు ఉన్నాయి. ఈ పూర్వ ప్రాథమిక పాఠశాలలు తల్లిదండ్రుల నుంచి మంచి స్పందనను పొందుతూ, ఎర్లీ చైల్డ్‌హుడ్ విద్యకు పునాదులు వేయడంలో సహాయపడుతున్నాయి. ఈ పాఠశాలలతో పూర్వ ప్రాథమిక మరియు ప్రాథమిక తరగతుల్లో విద్యార్థుల హాజరు పెరిగింది. ఈ నేపథ్యంలో, ప్రభుత్వం స్థానిక సంస్థల పరిధిలో 1,000 పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక సెక్షన్లు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఒక్కో పాఠశాలకు సమగ్రశిక్ష ద్వారా మానవ వనరుల కోసం రూ.2 లక్షలు, పిల్లలకు అవసరమైన పరికరాల కొనుగోలుకు మరొక రూ.1 లక్ష కేటాయించేందుకు మంత్రిమండలి అనుమతించింది. ఈ మొత్తం ఖర్చు రూ.32 కోట్లు అవుతుందని ప్రభుత్వం గుర్తించింది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న ఎర్త్ యూనివర్సిటీ ఆఫ్ తెలంగాణకు దివంగత మాజీ ప్రధాని డాక్టర్. మన్మోహన్‌సింగ్ పేరును పెట్టాలని మంత్రిమండలి నిర్ణయించింది. ఈ మేరకు "డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్‌సైన్సెస్ యూనివర్సిటీ ఆఫ్ తెలంగాణ" అనే పేరుతో బిల్లును ఆమోదించింది. ఈ నిర్ణయాలు రాష్ట్రంలో విద్యా రంగ అభివృద్ధికి కొత్త దిశలో దోహదపడనున్నాయి.

# ప్రతి మండలానికి సర్వేయర్లు

స్టేట్ బ్యూరో, విశాలభారతి:

రాష్ట్రంలో భూములకు సంబంధించిన అనేక పంచాయితీలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో ప్రభుత్వం మరో మార్పునకు శ్రీకారం చుట్టనుంది. ఇందులో భాగంగా గ్రామ రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ఇప్పటికే గ్రామ పాలనాధికారులు జీపీవోను అందుబాటులోకి తీసుకురాగా.. తాజాగా క్షేత్రస్థాయిలో ప్రజలకు సులభంగా భూ సేవలు అందేలా ప్రతి మండలానికి కనీసం 4 నుంచి 6 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. అయితే వీరంతా విధుల్లోకి రాబోతున్నారు. లైసెన్స్ సర్వేయర్లకు సంబంధించి రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. ఈనెల 19వ తేదీన శిల్ప కళావేదికలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శిక్షణ పొందిన లైసెన్స్‌డ్ సర్వేయర్లకు లైసెన్స్‌లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకు వచ్చిన భూభారతి చట్టంలో రిజిస్ట్రేషన్ సమయంలో భూమి సర్వే మ్యాప్ ను జత పరచడం తప్పనిసరి చేసిన నేపథ్యంలో సర్వే విభాగం పాత్ర మరింత క్రియాశీలం కానుంది. భూభారతి చట్టంలో పేర్కొన్న విధంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే ప్రస్తుతం ఉన్న 350 మంది సర్వేయర్లు సరిపోయే పరిస్థితి లేదు. మరికొంత మంది సర్వేయర్లు అవసరమవుతారని ప్రభుత్వం భావించింది. దీనిని దృష్టిలో పెట్టుకొని ఒక వైపు లైసెన్స్‌డ్ సర్వేయర్లను తీసుకోవడం, మరోవైపు సర్వే విభాగంలో ఖాళీగా ఉన్న సర్వేయర్ పోస్టులు భర్తీచేయడం ప్రారంభించింది. శుక్రవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో రెవెన్యూశాఖ కార్యదర్శి డిఎస్ లోకేష్‌కుమార్, సర్వే విభాగం కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంత్ తో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఈ పోస్టులకు పది వేల మంది దరఖాస్తు చేసుకోగా తొలివిడతలో ఏడు వేల మందికి శిక్షణ ఇచ్చామని ఇందులో 3465 మంది అర్హత సాధించారని తెలిపారు. భూ విస్తీర్ణాన్ని బట్టి ప్రతి మండలానికి 4 నుంచి 6 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తామని తెలిపారు. రెండవ విడతలో మరో మూడు వేల మందికి ఆగస్టు 18వ తేదీ నుంచి శిక్షణను ప్రారంభించామని ఈనెల 26వ తేదీన జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో అర్హత పరీక్ష నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ పరీక్షలో అర్హత సాధించిన వారికి 40 రోజుల పాటు అప్రెంటిస్ శిక్షణ ఉంటుందని వీరి సేవలు కూడా డిసెంబర్ రెండవ వారం నాటికి అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. రెవెన్యూ శాఖకు సర్వే విభాగానికి అవినాభావ సంబంధం ఉంటుందని మంత్రి పొంగులేటి చెప్పారు. భూముల కొలతలు, రికార్డులు స్పష్టంగా ఉన్నప్పుడే వివాదాలు తగ్గుతాయని సర్వే వ్యవస్థ బలపడితేనే ప్రజలకు భద్రత, న్యాయం లభిస్తుందన్నారు. గత పది సంవత్సరాలుగా సర్వే విభాగం నిర్లక్ష్యానికి గురైందని, క్షేత్రస్థాయిలో సిబ్బంది లేకపోవడం వల్ల ప్రజలకు తగిన సేవలు అందలేదని గుర్తుచేశారు. ప్రతి రెవెన్యూ గ్రామంలో జీపీవోలు, ఇప్పుడు ప్రతి మండలంలో లైసెన్స్‌డ్ సర్వేయర్లు ఈ రెండు చర్యలతో ప్రజలకు అవసరమైన భూ సంబంధిత సేవలు అందేలా వ్యవస్థను పటిష్టం చేయడమే లక్ష్యమని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

# బయ్యారం సర్పంచ్ బరిలో భూక్య రవి నాయక్

- ప్రజల సేవే తన లక్ష్యం
- పదవికోసం కాదు, బాధ్యత కోసం బరిలోకి
- పదిహేనేళ్లుగా సమసమాజ స్థాపన కోసం కృషి

మహబూబాబాద్, విశాలభారతి:

బయ్యారం గ్రామ అభివృద్ధి పట్ల అచంచలమైన అంకితభావంతో సేవలందిస్తున్న ప్రజా నాయకుడు భూక్య రవి నాయక్ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్ పదవికి బరిలో దిగుతున్నారు. గత పదిహేనేళ్లుగా సమసమాజ స్థాపన లక్ష్యంగా కృషి చేస్తున్న ఆయన, విద్యార్థి నాయకత్వం నుంచి ప్రజా సేవా మార్గంలో అడుగులు వేస్తూ, ప్రతి ఒక్కరి మనసును గెలుచుకున్నారు. సమాన హక్కులు, సామాజిక న్యాయం, పేదల సంక్షేమం కోసం నిరంతరం పోరాటం సాగించిన రవి నాయక్, గ్రామ ప్రజలకు సదుపాయాలు కల్పించడం, పేద కుటుంబాలకు సహాయం చేయడం వంటి అనేక కార్యక్రమాలు చేపట్టారు. ప్రజల్లో తనకు లభిస్తున్న ఆదరణే తన బలం అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ – "నా పోరాటం పదవికోసం కాదు, ప్రజల కోసం. నా విజయం అంటే బయ్యారం ప్రజల గెలుపు. మీ ఆశీర్వాదం నాకెంతో అవసరం. గ్రామ అభివృద్ధికి నా శ్రమను అంకితం చేస్తాను" అని అన్నారు.

# రేవంత్ క్యాబినెట్ దండుపాళ్యం ముఠా

(మొదటిపేజీ తరువాయి)



సభ్యులే ఆరోపణలు చేశారని గుర్తుచేశారు. మంత్రి కుటుంబ సభ్యుల ఆరోపణలపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రే తుపాకీ పంపించారని, తమ్ముళ్ల కోసం ఫైల్స్ ఆపుతున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి కేబినెట్ దండుపాళ్యం ముఠా మాదిరిగా తయారైందని ఎద్దేవా చేశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు మాజీ మంత్రి హరీశ్‌రావు. వ్యాపారవేత్తలకు తుపాకులు పెట్టే సంస్కృతిని రేవంత్ హయాంలో తీసుకొచ్చారని ఆక్షేపించారు. కేంద్ర ప్రభుత్వం స్పందించకుంటే కాంగ్రెస్, బీజేపీ మధ్య అక్రమ సంబంధం ఉందని భావించాల్సి ఉంటుందని చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రి సన్నిహితులే తుపాకీ పెట్టి బెదిరించే పరిస్థితులు వచ్చాయని విమర్శించారు. రాష్ట్రంలో ఇంత జరుగుతుంటే కేంద్రం ఎందుకు మౌనంగా ఉంటుందని ప్రశ్నల వర్షం కురిపించారు. దీనిపై కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఎందుకు నోరు మెదపటం లేదు..? అని నిలదీశారు. మంత్రుల పంచాయితీలు పరిష్కరించడానికే కేబినెట్ సమావేశాలు పెడుతున్నారని సెటైర్లు గుప్పించారు మాజీ మంత్రి హరీశ్‌రావు. కేబినెట్ భేటీలో మంత్రులు తిట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి కేబినెట్ ఆరడజను వర్గాలుగా విడిపోయిందని దెప్పిపొడిచారు. రాష్ట్రప్రభుత్వం అతుకుల బొంతలాగా మారిందని స్వయానా కాంగ్రెస్ ఎమ్మెల్యేలే చెబుతున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి హయాంలోని 23 నెలల్లో ఏం సాధించారని విజయోత్సవాలు జరుపుతారు..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కదిద్దుకోవాలన్న చందంగా.. కాంగ్రెస్ నేతలు అందిన కాడికి దోచుకుంటున్నారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో నీళ్లు, నిధుల వాటాలు సాధించామని ఉద్ఘాటించారు మాజీ మంత్రి హరీశ్‌రావు.

రేవంత్‌రెడ్డి హయాంలో మాత్రం అవినీతి వాటాల కోసం కొట్లాడుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పారిశ్రామికవేత్తలు, సినిమా ఇండస్ట్రీ, కాంట్రాక్టర్లను కాంగ్రెస్ నేతలు బెదిరించి లొంగదీసుకుంటున్నారని ఆరోపించారు. హ్యామ్ మోడల్‌పై బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విచారణ జరుపుతామని హెచ్చరించారు. హ్యామ్ మోడల్ బోగస్ అని.. కమీషన్లు దండుకోవటానికే ఈ మోడల్ తీసుకువస్తున్నారని ఆరోపించారు. దీపావళికైనా హామీలు అమలు చేస్తారని ఎదురుచూసిన ప్రజలకు మళ్లీ నిరాశే ఎదురైందని మాజీమంత్రి హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కారులో మంటలు

**రాజేంద్రనగర్, విశాలభారతి :**

నడుస్తున్న డస్టర్ కారులో మంటలు చెల్లారేగిన సంఘటన మైలార్దేవుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. పాత బస్తీ చంద్రాయణ్ గుట్ట వైపు నుంచి నుంచి ఆరాంఘర్ వైపు వస్తున్న ఓ డస్టర్ కారులో పల్లె చెరువు దగ్గర ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. విషయం గుర్తించిన డ్రైవర్ పటాన్ చెరుకు చెందిన డ్రైవర్ శ్రావణ్ బయటకు దిగడంతో పపెను ప్రమాదం తప్పింది. స్థానికులు మంటలు అర్పివేశారు.



# ఆశన్నతో సహా 208 మంది నక్సలైట్ల సరెండర్

- మావోయిస్టు పార్టీకి వరుస ఎదురుదెబ్బలు
- మల్లోజుల 60 మందితో కలిసి లొంగిపోయారు
- ఆశన్న 208 మందితో కలిసి లొంగిపోయారు
- పార్టీ చరిత్రలో ఇదే పెద్ద లొంగుబాటు
- చాలా కీలక దాడుల్లో ఆశన్న పేరు
- ఆశన్నది ములుగు జిల్లా నర్సింగాపూర్
- లొంగిపోయేముందు భావోద్వేగ సందేశం

**స్టేట్ బ్యూరో, జాతీయం:**



మావోయిస్టు పార్టీకి వరుసగా ఎదురుదెబ్బలు తగులుతూనే ఉన్నాయి. మొన్నటికి మొన్న మావోయిస్టు అగ్రనేత మల్లోజుల 60 మంది సహచరులతో కలిసి లొంగిపోయారు. తాజాగా అగ్రనేత, పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న, రూపేష్ ఛత్తీస్‌ఘడ్ పోలీసులు ఎదట లొంగిపోయారు. ఆశన్న సహా 208 మంది మావోయిస్టులు పోలీసులకు ఆయుధాలు అప్పగించారు. మావోయిస్టు పార్టీ చరిత్రలో ఇదే పెద్ద లొంగుబాటుగా చెబుతున్నారు. లొంగిపోయిన వారిలో 110 మంది మహిళలు, 98 మంది పురుషులు ఉన్నారు. 153 తుపాకులు, 19 ఏకే 47 రైఫిళ్లు, 17 ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు, 23 ఇన్సాస్‌లు, 1 ఇన్సాస్ ఎల్ఎంజీ, 303 రైఫిళ్లు, 11 బీజీఎల్, నాలుగు కార్బైన్‌లు, 41 బోర్ షాట్ గన్స్, పిస్తోళ్లను పోలీసులకు అప్పజెప్పారు. అయితే ఆశన్న పేరు చాలా కీలక దాడుల్లో వినిపించింది. ఆయన వ్యూహం వేస్తే పక్కాగా జరిగేదని కొందరు చెబుతుంటారు. సీఎం చంద్రబాబు నాయుడు, మాజీ సీఎం నేదురుమల్లి జనార్ధనరెడ్డిలపై బాంబులు పేల్చి హత్యాయత్నం చేసినప్పుడు ఆశన్న పేరు ఎక్కువగా వినిపించింది. అంతేకాదు ఐపీఎస్ అధికారి ఉమేశ్ చంద్ర హత్య, అప్పటి హోంమంత్రి మాధవరెడ్డి హత్య ఘటనల్లోనూ ఆశన్న ఉన్నారని ఇప్పటికీ పలువురు చెబుతుంటారు. ఆశన్నది ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని నర్సింగాపూర్ గ్రామం. 40 ఏళ్ల కిందట ఉద్యమం వైపునకు ఆకర్శితులు అయ్యారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు వెంకటాపూర్ మండలంలోని లక్ష్మీదేవిపేట ప్రభుత్వ స్కూల్‌లో చదువుకున్నారు. తర్వాత కాజీపేటలో సెకండరీ విద్య, కాకతీయ యూనివర్సిటీలో డిగ్రీ చదివారు. ఈ సమయంలోనే రాడికల్ స్టూడెంట్ యూనియన్‌తో సంబంధాలు ఏర్పడ్డాయి. ఆర్ఎస్‌యూ కోసం ఆశన్న చాలా కాలం పని చేశారు. తర్వాత నిర్బంధం పెరగడంతో 25 ఏళ్ల వయసులో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. మావోయిస్టు పార్టీలో ఆయన కీలక బాధ్యతలు చూసుకున్నారు. లొంగిపోయేముందు ఆశన్న భావోద్వేగ సందేశం ఇచ్చిన విషయం తెలిసిందే. క్లిష్ట పరిస్థితుల్లో లొంగుబాటు నిర్ణయం తీసుకున్నట్టుగా ప్రకటించారు. తమ సహచరులు కొందరు ఇంకా పోరాటం చేయాలనుకుంటున్నట్టుగా వెల్లడించారు. భద్రతను పరిగణనలోకి తీసుకోవాలని సహచరులు కోరుతున్నారన్నారు. ముందుగా రక్షణ చాలా అవసరం అని, సమాజ ప్రధాన ప్రవంతిలోకి రావాల్సిన సమయం వచ్చిందని చెప్పారు ఆశన్న. అడవులు, ఇతర రాష్ట్రాల్లోని మావోయిస్టులు లొంగిపోవాలని అనుకుంటే తనతోపాటు చేరేందుకు సంప్రదించాలని పిలుపుచ్చారు.



## బిటిపిఎస్‌లో నూరుశాతం పనులు కేటాయించాలి

- బీటిపిఎస్ గేటు ముందు విటీడీఏ ధర్నా
- గిరిజన సమాజానికి అన్యాయం జరుగుతోంది
- బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి పోడియం బాలరాజు

**మణుగూరు, విశాలభారతి :**

భద్రాద్రి పవర్ ప్లాంట్ లో విటీడీఏ(విలేజ్ ట్రైబల్ డెవలప్మెంట్ ఏజెన్సీ)లకు పనులు కేటాయించేలా ఆదేశాలు జారీచేయాలని బిటిపిఎస్ విటీడీఏ సొసైటీ మరియు గిరిజన(కోయ)కాంట్రాక్టర్స్ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం బిటిపిఎస్ గేటుముందు సుమారు మూడు గంటలకు పైగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి పోడియం బాలరాజు మాట్లాడుతూ ప్రభావిత వీటీడీఏ ఆదివాసి సొసైటీలకు మరియు ఆదివాసి గ్రామాల కాంట్రాక్ట్ ఫార్ములకు నిర్దిష్ట శాతం పనులు కేటాయించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ ప్రస్తుత స్థానిక టీఎస్ జెన్కో అధికారులు స్థానిక రాజకీయ నాయకులు మరియు నియమిత బిల్డర్లు అనుచరులు తమ ప్రభావం ఉపయోగించి మా ఆదివాసి గిరిజనులకు పనులకు బదులుగా ఇతర పనులు కేటాయిస్తున్నారన్నారు. షెడ్యూల్ చేయబడిన పనులలో బాయిలర్ టర్బైన్ ఈ.ఎస్.పి పంప్ హౌస్ సర్వీస్ బిల్డింగ్ మెయింటెనెన్స్ గార్డెన్ క్లీనింగ్ కోల్ క్లీనింగ్ మొదలైన అన్ని బీటీపీఎస్ సి ఈ పరిధిలో ఉన్న అన్ స్కిల్డ్, సెమి స్కిల్ మెయింటెనెన్స్ పనులు అయినప్పటికీ మాకు ఇప్పటి వరకు ఏ విధమైన ఉపాధి కల్పించలేదన్నారు. 2018 ఐటీడీఏ పీవో సర్క్యులర్ ప్రకారము ప్రభావిత ఆదివాసి సొసైటీలకు పనులు వెంటనే కేటాయించాలని ఆదేశాలు జారీ చేయవలసిందిగా కోరారు. మా హక్కును హరించే విధంగా జరుగుతున్న టెండర్ ప్రక్రియలో అవినీతి మరియు అక్రమాలపై తక్షణమే విచారణ జరిపి సంబంధిత కాంట్రాక్టర్లను నిలిపివేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి పోడియం బాలరాజు , హైకోర్టు అడ్వకేట్ ఓకే రవి,పొలిటికల్ జేఏసీ వాసం రామకృష్ణ, సొసైటీ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ వజ్జా శ్యామ్ , జెఎసి కోఆర్డినేటర్ మడి శంకర్, సెక్రెటరీ బొగ్గం రమేష్, ట్రెజరర్ గొట్టం ఝాన్సీ, సాంబాయిగూడెం మాజీ సర్పంచ్ తిరుపతమ్మ ,పూణెం గోపాల్ , మడి స్వరూప, వర్సా శ్రీను, అలెం కోటి తదితరులు పాల్గొన్నారు.

## గవాయిపై దాడి వెనుక ఉన్న శక్తులను శిక్షించాలి




**ఎం.ఆర్.పి.ఎస్ మండల అధ్యక్షులు సూరారం రాజు మాదిగ**

**అడ్డ గూడూరు, విశాలభారతి:**

సామాజిక ఉద్యమాల పెద్దన్న ఎం.ఆర్.పి.ఎస్ అధినేత పద్మశ్రీ మంద క్రిష్ణ మాదిగ ఆదేశానుసారం ఈనెల 7వ తారీఖున సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి బి ఆర్ గవాయి పై దాడి చేసిన వ్యక్తి పై కేసు నమోదు చేసి శిక్షించాలని నేడు అడ్డగూడూర్ మండలంలోని అంబేద్కర్ విగ్రహం నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు దళితుల ఆత్మగౌరవ నిరసన ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎం.ఆర్.పి.ఎస్ మండల అధ్యక్షులు సూరారం రాజు మాట్లాడుతూ జస్టిస్ బి.ఆర్ గవాయి పై దాడి చేసిన శక్తులను గుర్తించి సుప్రీం కోర్టులో ప్రజాస్వామికా వాదులుగా గుర్తించబడ్డ సీనియర్ జడ్జిలతో విచారణ చేయించాలి. ఈ దాడి అణాగారికమైంది. ఈ దాడి ప్రజాస్వామ్యం పై దాడీగా పరిగానిచల్సిన అవసరం ఉంది. ఇది యావత్ దళిత సమాజం పై దాడిగా అభివర్ణించారు. కార్యక్రమంలో ఎం.ఆర్.పి.ఎస్ నాయకులు, ఎం.ఆర్.పి.ఎస్ అడ్డగూడూర్ మండల ప్రధాన కార్యదర్శి బాలెంల నరేష్, సీనియర్ నాయకులు బాలెంల రాజు గజ్జెల్లీ రవి బాలెంల మహేందర్ బుర్రు అనిల్ దర్శనలా సతీష్ మందుల ఐలయ్య డప్పు యాదగిరి పోలికేక బాబు రావు గజ్జెల్లీ క్రిష్ణ గూడెపు దామొదర్ బాలెంల పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

## పత్రికా స్వేచ్ఛపై కక్ష్యసాధింపు చర్యలు తగవు

**దేవరుప్పల, విశాలభారతి:**

ప్రజాస్వామ్య మనుగడ కోసం నిత్యం పాటుపడే పత్రికా స్వేచ్ఛపై పాలక వర్గాల రాజకీయ కక్ష్య సాధింపుల చర్యలు తగవని ప్రతిపక్షాల మండల నేతలు సింగారపు రమేష్, బిల్లా తిరుపతిరెడ్డి, తీగల దయాకర్, పడమటింటిన నర్సింహ్మా విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జనగామ-సూర్యాపేట రహదారి చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సాక్షి దిన పత్రిక ఎడిటర్ ధనుంజయ్‌రెడ్డిపై ఏపీ ప్రభుత్వం అక్రమ కేసుల బనాయించే చర్యలను నిరసిస్తూ ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు, జర్నలిస్టుల ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి బేషరతుగా సత్వరమే కేసులు ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పత్రిక ఆవిర్భావం నుంచి నిష్పక్షపాతంగా ప్రజల పక్షాన నిలుస్తూ తెలంగాణ సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన సాక్షి దినపత్రిక నేటికి అన్ని వర్గాల ప్రజా సమస్యల సాధన కోసం బాసటగా నిలుస్తుందన్నారు. సాక్షి దిన పత్రికపై ఏపీ సీఎం చంద్రబాబు కుట్ర కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రతినిధులు ఈటూరి విజయ్‌కుమార్, నల్ల లక్ష్మీపతి, ఊడుగు సందీప్‌కుమార్, పత్తేపురం శేఖర్, సారయ్య, సోమేష్, గోవర్ధన్, బీఆర్ఎస్ వర్కింగ్ మండల ప్రెసిడెంటు రామ్‌సింగ్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పడమటింటి నర్సింహ్మా, బీఆర్ఎస్ తదితరులు పాల్గొన్నారు.




## గాయపడిన నాయకులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**కురవి, విశాలభారతి:**

కురవి మండలంలోని లింగ్యా తండా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బాదావత్ లక్ష్మణ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో చేయికి తీవ్ర గాయం కావడంతో ఫ్రాక్చర్ అయ్యింది. ఈ నేపథ్యంలో డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యా నాయక్ నేడు ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని స్వయంగా తెలుసుకున్నారు. లక్ష్మణ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఆయన ధైర్యంగా ఉండాలని సూచించారు. అలాగే అదే గ్రామానికి చెందిన బానోత్ కిషన్ కూడా ఇటీవల బైక్ ప్రమాదంలో కాలుకు, చేయికి గాయాలతో బాధపడుతున్నారు. రెడ్యా నాయక్ ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి, వైద్యులు సూచించిన చికిత్స పద్ధతులను క్రమంగా పాటించి త్వరగా కోలుకోవాలని సూచించారు. అదేవిధంగా బాదావత్ బాలకిషన్ వెన్నునొప్పితో ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న విషయం తెలుసుకున్న రెడ్యా నాయక్ ఆయనను కూడా పరామర్శించి ధైర్యం చెప్పి త్వరగా ఆరోగ్యవంతుడిగా మారాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రెడ్యా నాయక్ మాట్లాడుతూ,



"ప్రజలతో ఉన్న బంధం నా రాజకీయ జీవితానికి మూలం. ఎవరికైనా ఇలాంటి ఇబ్బందులు ఎదురైతే మనం తోడుగా నిలవాలి" అని అన్నారు. వారి వెంట కురవి మాజీ ఎంపీపీ గుగులోతు పద్మావతి, యూత్ రాష్ట్ర నాయకుడు గుగులోతు రవినాయక్, మాజీ సర్పంచ్ బాదావత్ రవి నాయక్, సీనియర్ నాయకులు బాదావత్ రూప్లా నాయక్, బాదావత్ రామకృష్ణ నాయక్, వెంకన్న నాయక్, యుగేందర్ నాయక్, పందరి నాయక్, రవి నాయక్, సేవ్య నాయక్, భరత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ బంద్‌ను జయప్రదం చేయాలి

**బబ్బూరి శ్రీకాంత్ గౌడ్**

**జనగామ, విశాలభారతి:**



బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 18న బీసీ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) ఇచ్చిన తెలంగాణ రాష్ట్ర బంద్ ను జయప్రదం చేయాలని బిఆర్ఎస్ జిల్లా నాయకులు, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ పిలుపునిచ్చారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కేటాయిస్తూ జారీ చేసిన జీఓ నంబర్ 9ని సుప్రీంకోర్టు, హైకోర్టులు కొట్టివేయడం ప్రజా వ్యతిరేకమని, అభివృద్ధి నిరోధకమని, వెనుకబడిన వర్గాలను ఇంకా వెనక్కి నెట్టేసేదిగా ఉన్న ఈ తీర్పులను తీవ్రంగా నిరసిస్తున్నట్లు తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే వరకు తమ పోరాటం ఆగదని అన్నారు. విద్యా సంస్థలు, వ్యాపార సంస్థలు, బస్సులు రవాణా వ్యవస్థ స్వచ్ఛందంగా బంద్ పాటించాలని కోరారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

హయత్‌నగర్‌లోని ఎమ్మార్వో ఆఫీస్ ఆవరణలో ఎల్లమ్మ దేవాలయం సమీపంలో శుక్రవారం రోజు ఉదయం సుమారు 10:00 గంటల సమయంలో గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం లభ్యమైందని ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్ తెలిపారు. హయత్ నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు వయస్సు సుమారు 45 నుండి 50 సంవత్సరాల మధ్యగా ఉండవచ్చని పోలీసులు తెలిపారు. చూడటానికి ముస్లింలాగా కనిపిస్తున్నాడని పేర్కొన్నారు. వ్యక్తిని ఎవరు గుర్తించినా, వెంటనే హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌కి సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

**సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు: 8712662640, 8712662285.**



## ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కార్పొరేటర్ కళ్లెం

**పెద్ద అంబర్పేట్, విశాలభారతి:**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచార కార్యక్రమంలో హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి కొరకు భారతీయ జనతా పార్టీ అభ్యర్థి శ్రీ లంకల దీపక్ రెడ్డిని గెలిపించాలని లక్ష్యంగా, ఎల్.బి.నగర్ నియోజకవర్గ బీజేపీ కార్పొరేటర్లతో కలిసి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నవజీవన్ రెడ్డి స్థానిక నాయకులు, కార్యకర్తలతో సమావేశమై ఎన్నికల ప్రచార కార్యాచరణపై సూచనలు ఇచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు జూబ్లీహిల్స్ ప్రజల అభివృద్ధి కోసం ఎలాంటి కృషి చేయలేదని, ప్రజల మద్దతు కోసం కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ఎంఐఎం లాంటి పార్టీలతో కుటిల రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి, ప్రజా సేవే తమ పార్టీ లక్ష్యమని, ప్రజలు దీపక్ రెడ్డి గారిని గెలిపించి బీజేపీకి విజయం అందించాలని పిలుపునిచ్చారు.

# బీసీ బంద్‌న విజయవంతం చేయాలి

**మునుగోడు, విశాలభారతి:**



మండల కేంద్రంలో మణి గార్డెన్ లో జరిగిన బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు హైకోర్టు స్టే ఇచ్చిన విషయంలో బిసి జాక్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రేపు మండల కేంద్రంలో బంద్ పాటించాలని అన్ని రాజకీయ పార్టీలు,కుల సంఘాల తో విస్తృత స్థాయి సమావేశం బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూడిద మల్లికార్జున్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గుంటోజు వెంకటాచారి ఆధ్వర్యంలో నిర్వహిచడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు బూడిద లింగయ్య యాదవ్ గారు మాట్లాడుతూ స్వాతాంత్రం వచ్చి 78 సవత్సరాలు అయిన బీసీల బతుకులు మారలేవు అని అన్నారు.కొంత మంది హైకోర్టులో బీసీ రిజర్వేషన్ల వ్యతేరేక శక్తులు అడ్డుపడం సరైంది కాదు అని అన్నారు మేము జనాభాలో 60 శాతం కు పైన ఉంటే మాకు కేవలం 42 శాతం స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పిస్తే అడ్డుకుంటున్నారు మేము ఏమన్నా MLA,MP, ముఖ్యమంత్రి పదవులు అడుగుతున్నామా స్థానిక ఎన్నికల్లోనా బీసీ ప్రజలు సర్పంచ్ లుగా ఎంపీటీసీలు గా జడ్పీటీసీ లుగా చేయకుండా అడ్డుపడడం సరికాదు బీసీ రిజర్వేషన్ల కు జీవో నెంబర్ 9 కి అడ్డు చెప్పకుండా రిజర్వేషన్లను ముందుకు పోయే విదంగా చేయాలని అన్నారు.వివిధ రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వచ్చే వరకు బీసీ ఉద్యంలో ముందుండి పోరాడుతం అని వారు అన్నారు ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి అనగంటి కృష్ణ, ఈదులకంటి కైలాసం ,బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు పెంబల జానయ్య,భారత రాష్ట్ర సమితి మండల అధ్యక్షుడు మందుల సత్యం,సీపీఐ పార్టీ మండల కార్యదర్శి చాపల శ్రీను,సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బోలుగురి నర్సింహ,మునుగోడు సర్పంచ్ ల ఫోరమ్ మాజీ అధ్యక్షుడు మిరియాల వెంకన్న మరియు AIYF జిల్లా కార్యదర్శి తిరుపారి వెంకటేశ్వర్లు, సీపీఎం మండల నాయకులు లింగస్వామి,డోలు దెబ్బ జిల్లా నాయకులు మాలిగా యాదయ్య మరియు మాజీ ఎంపీటీసీ జిట్టగొని యాదయ్య,సీపీఐ పార్టీ రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాంపల్లిలో హనుమాన్ విగ్రహం ధ్వంసం

**పోలీసుల వైఖరికి నిరసన వ్యక్తం చేసిన బిజెపి నాయకులు**

**కీసర,విశాల భారతి :**




కీసర పోలీస్ స్టేషన్ పరిధి రాంపల్లిలో శనివారం రాత్రి సీత రామాంజనేయ దేవాలయం పక్కన ఉన్న హనుమాన్ విగ్రహం మరియు గాధ ధ్వంసం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు.ఉదయం తెల్లవారుజామున చూసిన కొందరు వ్యక్తులు కీసర పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న కీసర పోలీసులు.దేవాలయం పక్కన ఉన్నసి సి టివి కెమెరాలు పరిశీలించిన పోలీసులు.బీజేపీ ఆధ్వర్యంలో యువజన సంఘాల నాయకులు అంత కలిసి నిరసన వ్యక్తం చేస్తూ అనంతరం అంబేద్కర్ కూడలిలో మానవహారం నిర్వహించారు.ఈ సంధర్భంగా మాజీ జెడ్పీటీసీ సురేష్ మాట్లాడుతూ మహారాష్ట్ర కటక్ నుండి హనుమాన్ విగ్రహం తీసుకొని రావడం జరిగింది అని తెలిపారు.కొందరు హనుమాన్ విగ్రహం మట్టి విగ్రహం గాలికి హనుమాన్ గాధ విరిగిపోయింది అని పెళపన చేస్తున్నారు అని మండిపడ్డారు.పోలీస్ అన్నలకు దండం పెట్టి చెపుతున్న సమగ్ర విచారణ చేసి దోషులను శిక్షించాలి అని కోరారు.దేవాలయం పక్కన సి సి కెమెరాలు ఉన్నాయి అవి ఇప్పుడు పని చేయడం లేదు అని పోలీసులు చెపుతున్నారు. కానీ ఈది ఎంతవరకు సమంజసం అని ఆవేదన వ్యక్తం చేశారు.మొన్న ఈదే సి సి కెమేరాలు చూసి ఒక్క వ్యక్తికి ఫైన్ కూడా వేసిన పోలీసులు. ఏది ఏమైన సమగ్ర విచారణ చేపట్టి దోషులను పట్టుకొని శిక్షించాలి అని కోరారు. విషయం తెలుసుకున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు రాంపల్లి సీతారామాంజనేయ దేవాలయంకు విచ్చేశారు.కుషాయిగూడ ఎసిపి వెంకట్ రెడ్డిని కలిసి హనుమాన్ విగ్రహం ధ్వంసం ఎలా జరిగింది అని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ రాష్ట్రంలో ముత్యాలమ్మ గుడి ఘటన మరవక ముందే మళ్ళీ హనుమాన్ విగ్రహం ధ్వంసం చేయడం చాలా బాధాకరమైన విషయం అని అన్నారు. సి సి కెమేరాలు ఉన్న సమయానికి పనిచేయపోవడం దురదృష్టకరమైన విషయం అని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం గస్తీ బాగా ఏర్పాటు చేయాలి అలాగే దోషులను పట్టుకొని శిక్షించాలి అని కోరారు.ఈ కార్యక్రమంలో యువజన సంఘాల నాయకులు,బిజెపి పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



## బీసీ బంద్‌ను విజయవంతం చేయాలి

**మాజీ మంత్రివర్యులు సత్యవతి రాథోడ్ పిలుపు**

**మహబూబాబాద్ విశాలభారతి:**

రాష్ట్రవ్యాప్తంగా బీసీ వర్గాల హక్కుల సాధన కోసం చేపట్టిన బంద్‌కు మాజీ మంత్రివర్యులు సత్యవతి రాథోడ్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. బంద్ అనేది కేవలం నిరసన కాదు, బీసీల ఆత్మగౌరవాన్ని చాటే సమూహప్రతిజ్ఞ అని ఆమె పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు, వ్యాపారవేత్తలు, విద్యార్థులు, ఉద్యోగులు, రవాణా సంఘాలు కలిసి ఈ బంద్‌ను శాంతియుతంగా విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ బీసీ వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు అనేది కేవలం సంఖ్య కాదు, శతాబ్దాల న్యాయం. మన బీసీ సమాజం సమాన అవకాశాలు, సముచిత గౌరవం పొందే వరకు పోరాటం ఆగదు. ఈ బంద్ మన గళాన్ని ప్రభుత్వ దృష్టికి చేర్చే దిశగా ముఖ్యమైన అడుగు" అని తెలిపారు. అదేవిధంగా బీసీల సమస్యలు పరిష్కారమయ్యే వరకు తమ మద్దతు నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. గతంలో బీసీ విద్యార్థుల హాస్టళ్లు, వెనుకబడిన వృత్తిజీవుల సహాయనిధుల పెంపు వంటి అంశాలపై తాను నిరంతరం కృషి చేసిన విషయాన్ని గుర్తుచేశారు. "బీసీ వర్గాల అభివృద్ధి లేకుండా రాష్ట్ర ప్రగతి అసాధ్యం. సమాజం మొత్తం బీసీలతో ఏకమై నిలబడాలి. ప్రభుత్వాలు మారినా మన హక్కుల కోసం పోరాటం ఆగకూడదు," అని సత్యవతి రాథోడ్ ఉద్ఘాటించారు. రేపటి బంద్ ద్వారా బీసీ వర్గాల ఐక్యతను దేశానికి చూపుదాం అని ఆమె ప్రజలకు పిలుపునిస్తూ, బంద్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు.



# రిసార్ట్‌లలో అసాంఘిక కార్యక్రమాలకు అనుమతి లేదు

- ఫామ్ హౌస్లపై పోలీసు నిఘా ఉంటుంది
- ఆదాయ వనరులను దెబ్బ తీసుకోవద్దు
- రిసార్ట్, ఫామ్ హౌస్ యాజమానుల అవగాహన సదస్సు
- మీడియా సమావేశంలో పాల్గొన్న మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డి




**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**

ఫామ్ హౌస్లపై పోలీసు నిఘా ఉంటుందని వాటిలో రిసార్ట్ లలో అసాంఘిక కార్యక్రమాల నిర్వహణకు తావులేదని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి అన్నారు. వీటిని అతిక్రమించి తల నొప్పులు తెచ్చుకోవద్దని సూచించారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు ఆధ్వర్యంలో రిసార్ట్, ఫామ్ హౌస్ యాజమానులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముజ్రా, రేవ్ పార్టీలకు అనుమతించబోమన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహేశ్వరం డీసీపీ పరిధిలో క్రైమ్ రేట్ తగ్గించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించాలని చూస్తే నిబంధనలకు విరుద్ధమని హెచ్చరించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని రిసార్ట్, ఫామ్ హౌస్ ల పూర్తి వివరాలు సేకరించడం జరిగిందన్నారు. ఫామ్ హౌస్, రిసార్ట్ ల వివరాలను రాచకొండ పోలీస్ కమిషనరేట్ సైట్ లో పొందుపరచడం జరుగుతుందన్నారు. నగర శివారుల్లో రిసార్ట్, ఫామ్ హౌస్ లలో అత్యధికంగా ముజ్రా, రేవ్ పార్టీలు జరుగుతున్నవన్నారు. అలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నివారించేందుకు బందోబస్తు చర్యలు తీసుకుంటున్నామని హెచ్చరించారు. ఫామ్ హౌస్, రిసార్ట్ లపై త్వరలోనే రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ప్రత్యేక సైటును ఏర్పాటు చేస్తున్నామన్నారు. రిసార్ట్, ఫామ్ హౌస్ లలో నిర్వహించే పార్టీలకు సంబంధించి ముందు అనుమతులు తీసుకున్న తర్వాతనే అద్దెకు ఇచ్చే విధంగా యజమానులు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐలు మహేందర్ రెడ్డి, సత్యనారాయ, రవి కుమార్, నందీశ్వర్, వేణు గోపాల్ తదితరులున్నారు.

## బీసీ జేఏసీ బంద్‌కు కాంగ్రెస్ మద్దతు

**వాజేడు, విశాలభారతి:**



రాహుల్ గాంధీ పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సూచనల మేరకు బీసీ సంఘాల జేఏసీ బంద్ కు వాజేడు మండల కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని యువజన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గౌరారపు సర్వేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కుల సర్వేలకు ఆద్యుడు మాన్య శ్రీ రాహుల్ గాంధీ ఎన్నికల సమయంలో ప్రకటించిన కామారెడ్డి డిక్లరేషన్ కు తాము కట్టుబడి ఉన్నామని ఆయన పునరుద్ఘాటించారు. బీసీ రిజర్వేషన్లపై ఎట్టి పరిస్థితులను వెనకడుగు వేసే ప్రసక్తి లేదని తేల్చి చెప్పారు ఈ బీసీ సంఘాల జేఏసీ బంద్ ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని కనువిప్పు కలగాలని ఆయన ఆక్షేపించారు. బీసీ జేఏసీ బంద్ వాజేడు మండలం లోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు, అందరు మద్దతుగా నిలవాలని ఆదేశించారు.




## ఉపాధ్యాయుల బిల్లులను త్వరగా పరిష్కరించాలి

- నూతన ఏటివోగా నియామకం అయిన జయకృష్ణ
- సన్మానించిన ఎస్టీయూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తు పాండురంగారెడ్డి

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**

ఉపాధ్యాయుల బిల్లులను త్వరగా పరిష్కరించాలని నూతనంగా ఏటివో గా నియామకం చేపట్టిన జయకృష్ణను ఎస్టీయూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తు పాండురంగారెడ్డి కోరారు. గ్రూప్ I ఎన్నికై అసిస్టెంట్ ఖజానా అధికారిగా (ఏటవో) ఇబ్రహీంపట్నంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన జయకృష్ణ ను ఎస్టియూ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సత్తు పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల ఇబ్బందులను తొలగించడానికి కృషి చేయాలని ఆయనను కోరారు. చిన్నతనంలో ఉన్నత ఉద్యోగం సాధించి ఎందరో గ్రామీణ విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారని అభినందించారు. సివిల్స్ లక్ష్యంగా ఆయన చేస్తున్న ప్రయత్నం ఫలించాలని ఆకాంక్షించారు. నేటి యువత ఆదర్శంగా తీసుకొని ఉన్నత లక్ష్యాలు చేరే విధంగా లక్ష్యం ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టియూ నాయకులు బాలకృష్ణ, శ్రీనివాస్ గౌడ్, తిరుమలేశ్, గోపాల్, పాండు, యాదగిరి, రవికుమార్, లక్ష్మీనారాయణ, కేశవరావు, చారి తదితరులు పాల్గొన్నారు.

# 'సూర్య ఘర్ 'తో డబ్బు ఆదా




**తొర్రూరు, విశాలభారతి:**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ద్వారా సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకొని డబ్బు ఆదా చేసుకోవచ్చని టీజీరెడ్కో జిల్లా మేనేజర్ గంధం రాజేందర్ తెలిపారు. తొర్రూర్ మండలంలోని హరిపిరాల గ్రామపంచాయతీ ఆవరణలో సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంపై శుక్రవారం రెడ్కో ప్రతినిధులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా మేనేజర్ మాట్లాడుతూ సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుతో సొంతంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేసి బిల్లుల భారాన్ని తగ్గించుకునేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. జాతీయ స్థాయిలో నేషనల్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ ఏజెన్సీ(ఎన్‌పీఐఏ), రాష్ట్ర స్థాయిలో స్టేట్ ఇంప్లిమెంటేషన్ ఏజెన్సీలు (ఎస్ఐఏ) ఈ పథకాన్ని అమలు చేస్తాయని తెలిపారు. ప్రజలు పెద్దఎత్తున ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ నవీన్ కుమార్ యాదవ్, పంచాయతీ కార్యదర్శి దేవయ్య, స్థానికులు పాల్గొన్నారు.

# బీసీ బంద్‌ను జయప్రదం చేయండి



- బీసీ సంఘాలు, అఖిలపక్ష పార్టీలు పిలుపు

**బయ్యారం, విశాలభారతి:**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని, 42 శాతం రిజర్వేషన్ చట్టం చేసి తొమ్మిదో షెడ్యూల్లో పెట్టాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న బంద్ ను విజయవంతం చేయాలని కోరుతూ బయ్యారం మండల కేంద్రంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సన్నాహక సమావేశానికి అఖిలపక్ష పార్టీలు పాల్గొని పూర్తి మద్దతు ప్రకటించాయి. ఈ కార్యక్రమంలో బిసి సంఘాల నాయకులు, అఖిలపక్ష పార్టీల నాయకులు కొత్త వినయ్ బాబు, మండ రాజన్న, మదార్, సారిక శ్రీను, బిల్లకంటి సూర్యం, నందగిరి భద్రయ్య, నేతకాని రాకేష్, కీర్తి ఉదయ్, చల్ల గోవర్ధన్ లు పాల్గొని మాట్లాడుతూ 56% ఉన్న బీసీలకు రిజర్వేషన్లు అందకుండా పాలక ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయని, చట్టపరంగా బీసీల జనాభాపరంగా బీసీలకు రావలసిన రిజర్వేషన్లు బిజెపి ప్రభుత్వం అడ్డుకుంటుందని, బీసీలంతా ఏకమై ఉద్యమించినప్పుడు మాత్రమే బీసీలకు చట్టపరంగా రిజర్వేషన్లు 42 శాతం అందుతాయని వారన్నారు. బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో వారి జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచాల్సిన అవసరం ఉందని, తక్షణమే 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు ఇవ్వని ఎడల అన్ని వర్గాల సహకారంతో కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి రిజర్వేషన్లు సాధించుకుంటామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నేతలు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం నాయకులు మక్కాల వీరన్న, వెన్ను వేణు, రామగిరి ఉప్పలయ్య, సిపిఎం నాయకులు మేడికొండ చంటి తదితరులు పాల్గొన్నారు.

## బీసీ బందుకు పూర్తి మద్దతు



**వాజేడు, విశాలభారతి:**

బీసీ సంఘాల రాష్ట్ర బంద్ కు ములుగు జిల్లా యాదవ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు ఓ ప్రకటనలో ములుగు జిల్లా యాదవ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లగాసి రమేష్ తెలిపారు. బీసీ రిజర్వేషన్ 42% ఇంప్లిమెంటేషన్ చేయాలని రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంఘాలు నేడు తలపెట్టిన బందుకు పూర్తి మద్దతు ప్రకటిస్తూ యాదవ సంఘం నాయకులంతా బందులో పాల్గొని విజయవంతం చేయాలని ములుగు జిల్లాలోని అన్ని మండలాల్లో ఉన్నటువంటి యాదవ సంఘం నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతనికి కృషి చేయాలని ఆయన అన్నారు.

## కాంగ్రెస్ నేతల ఓటింగ్

**రాజేంద్రనగర్, విశాలభారతి :**

డిసిసి అధ్యక్షుడి ఎన్నిక సందర్భంగా అభిప్రాయ సేకరణలో భాగంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం మంచిరేవులలోని పి.ఎస్.ఆర్ ఫంక్షన్ హాల్ లో శుక్రవారం నేతల ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐసిసి సభ్యుడు ఎంపీ రాబర్ట్ బ్రూస్, పీసీసీ ఉపాధ్యక్షులు వినయ్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కాంగ్రెస్ గండిపేట్ మండల అధ్యక్షుడు అశోక్ యాదవ్ పాల్గొన్నారు.



## ఘనంగా మహబూబ్ సుభాని ఉర్సు ఉత్సవం



**మహబూబాబాద్, విశాలభారతి:**

మహబూబాబాద్ మున్సిపాలిటీ అర్బన్ 6వ వార్డు బేతోలు గ్రామంలో ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో హజ్రత్ మహబూబ్ సుభాని దర్గా 12వ ఉర్సు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఖందిల్ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ ముస్లింలు ప్రతి సంవత్సరం జరుపుకునే ఈ ఉత్సవం విశేషంగా జరిగింది. గ్రామ ప్రభుత్వ పాఠశాల నుండి 12వ చాదర్, సందల్, ఖందిల్, జెండాలను డీజే, డప్పు సప్పుల తో ఊరేగింపుగా తీసుకెళ్లి దర్గా వద్ద ప్రతిష్ఠించారు. శుక్రవారం గ్రామమంతా ఉత్సవమయం కాగా, మహబూబ్ సుభాని దర్గా వద్ద ముస్లింలు ఫాతిహా ప్రార్థనలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. గౌసియాపాక్ దర్గా వద్ద జెండా గద్దె వద్ద కూడా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల వద్ద పెద్ద ఎత్తున అన్నదానం కార్యక్రమం చేపట్టారు. ఈ ఉత్సవంలో ఖందిల్ కమిటీ సభ్యులు షేక్ యూసుఫ్, షేక్ మస్తాన్, షేక్ మదర్, షేక్ ఖాదర్ బాబా, షేక్ జావిద్ (సదర్ సాబ్), షేక్ రహీం, షేక్ షరీఫ్, షేక్ ఇమామ్, షేక్ ఖాజా, షేక్ పాషా, షేక్ రఫీ, షేక్ ఇమ్రాన్ పెద్దలు గ్రామస్తులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భక్తుల సందోహంతో గ్రామమంతా భక్తి మయంగా మారింది.

## జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుని రేసులో సైదులు గౌడ్

**ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి శరత్ రౌత్‌కు దరఖాస్తు అందజేత**

**చౌటుప్పల్, విశాలభారతి:**

ఇటీవల ఏఐసీసీ తెలంగాణ రాష్ట్రంలో జిల్లా అధ్యక్షుల నియామకా ప్రక్రియ ప్రారంభించిన విషయం తెలిసినదే అయితే ఈ ప్రక్రియ ఈనెల 20 ముగియనుంది.ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలానికి చెందిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ముప్పిడి సైదులు గౌడ్ నామినేషన్ దాఖలు చేశారు.ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి,ఒరిస్సా మాజీ మంత్రి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుల ఎన్నికల పరివేక్షణ కర్త శరత్ రౌత్ కు దరఖాస్తు అందజేయడం జరిగింది.ఈ సమావేశంలో పాల్గొన్న సైదులు గౌడ్ తదనంతరం వారు మాట్లాడుతూ సుమారు 30 సంవత్సరాలుగా పార్టీలో క్రియాశీలకంగా పని చేస్తున్నానని కావున తనకి జిల్లా అధ్యక్షులు పదవి కేటాయించాలని జిల్లా పరివేక్షణ కర్త శరత్ రౌత్ నీ కోరారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు శామకుర రాజయ్య,ఉండాడి సత్యనారాయణ,డాకోజీ లక్ష్మి నారాయణ,గవ్వల నర్సింగ రావు,కొయ్యడ నర్సింహా గౌడ్,బోయ యాదయ్య, తూర్పింటి రవి మరియు తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర బంద్‌కు అందరూ కలిసి రావాలి


**బిఆర్ఎస్ నాయకులు**



**రాజేంద్రనగర్, విశాలభారతి:**

బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయకుండా అడ్డుకుంటున్నా బిజెపి కేంద్ర ప్రభుత్వం ఇటు కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుతున్న డ్రామాలు రేపు ఉదయం 8 గంటలకు బీసీ బంద్ కార్యక్రమం ఉంటుంది కావున బిసి రిజర్వేషన్ అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు నాగరాజు పిలుపు మేరకు బి ఆర్ ఎస్ కుటుంబ సభ్యులు, కుల సంఘాలు, అభిమానులు, కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున బీసీ బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతున్నట్లు బిఆర్ఎస్ నాయకులు తెలిపారు.

## బీసీ బందుకు సర్పంచ్ల ఫోరం మద్దతు



**చౌటుప్పల్, విశాలభారతి:**

బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కల్పించాలని నేడు జరిగే బీసీలకు మద్దతుగా పూర్తి మద్దతు ఉంటుందని సర్పంచ్ ల జే ఏ సీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర బంద్ కు ప్రతి గ్రామంలో తాజా మాజీ సర్పంచ్లు బాధ్యతలు తీసుకొని విజయవంతం చేయాలని ఒక ప్రకటనలో కోరారు.

## బీసీ బంద్‌ను విజవంతం చేయాలి

**సుర్వి నర్సింహా గౌడ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు**

**చౌటుప్పల్, విశాలభారతి:**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల సాధనకై నేడు తలపెట్టిన బీసీ బంద్ కు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సూచనలతో,శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశానుసారం నేడు మున్సిపాలిటీ మరియు మండలంలో బిసి సంఘాల ఆధ్వర్యంలో సర్వ మండలాలలో నిర్వహిస్తున్న తెలంగాణ బిసి బంద్ కార్యక్రమాన్ని విజవంతం చేయాలనీ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పిలుపునిచ్చారు. కావున జిల్లా కాంగ్రెస్ నాయకులు, మున్సిపాలిటీ, మండల కాంగ్రెస్ నాయకులు, అన్ని మున్సిపాలిటీ వార్డు అధ్యక్షులు, గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,యస్ సీ,యస్టి,బీసీ, మైనారిటీ, మహిళ,కిసాన్,యువజ న కాంగ్రెస్ అధ్యక్షులు ,సీనియర్ నాయకులు,మాజీ ప్రజా ప్రతినిధులు అందరూ పాల్గొని విజయవంతం చేయగలరని ఈ సందర్భంగా తెలిపారు.

## చర్లపల్లి డివిజన్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా


**ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**కాప్రా, విశాలభారతి:**

చర్లపల్లి డివిజన్ నీ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు.చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఆఫీసర్స్ కాలనీ, నాగార్జున నగర్, మీనాక్షి నగర్ లో 1.15 కోట్ల రూపాయల నిధులతో మంజూరు ఐన పనులను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్థానిక నాయకులు కాలనీ వాసులతో కలిసి పర్యవేక్షించడం జరిగింది. ఈ సందర్భగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కాలనీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## మెగా సిటీ స్కూల్‌లో దీపావళి వేడుకలు



**పెద్ద అంబర్పేట్, విశాలభారతి:**

హయత్ నగర్ లోని మెగా సిటీ స్కూల్ నందు దీపావళి పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ సుబ్బా రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీమతి వరలక్ష్మి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ ప్రదీప్ రెడ్డి పాల్గొన్నారు. దీపావళి పండుగ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించిన నిర్వాహకులు, భారతీయ సాంస్కృతిక విలువలను కాపాడుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో ఆనందం, సృజనాత్మకత, సాంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందించే ఉద్దేశ్యంతో ఈ వేడుకలు నిర్వహించబడ్డాయి. అక్టోబర్ 17వ తేదీ శుక్రవారం రోజున క్లే దియా మేకింగ్ వర్క్‌షాప్ కూడా నిర్వహించారు. విద్యార్థులు స్వయంగా మట్టి దీపాలను తయారు చేస్తూ పండుగ ఉత్సాహాన్ని ఆనందంగా అనుభవించారు. ఈ కార్యక్రమం ద్వారా పిల్లల్లో కళాత్మకతతో పాటు పర్యావరణహిత పండుగ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## స్మశాన వాటిక అభివృద్ధి పనులను పరిశీలించిన కళ్లెం

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

హయత్‌నగర్ డివిజన్‌లోని బంజారా కాలనీలో ఉన్న హిందూ స్మశాన వాటిక అభివృద్ధి పనులను స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్మశాన వాటికలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు అవసరమైన సౌకర్యాలు అందించే దిశగా పనులు నాణ్యతతో కొనసాగాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఏఈ హేము నాయక్, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సినిమా
హైదరాబాద్
శనివారం
18 అక్టోబర్ 2025
CINEMA



# బాలయ్య పై కాంతార కన్ను..?

గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం ప్రెస్టీజియస్ 'అఖండ 2' చిత్రాన్ని డిసెంబర్‌లో రిలీజ్ చేసేందుకు రెడీ అవుతున్నాడు. ఈ సినిమాతో బాక్సాఫీస్ దగ్గర మరోసారి బాలయ్య తాండవం చేయడం ఖాయమని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ సినిమా రిలీజ్‌కు ముందే, బాలయ్య తన నెక్స్ట్ చిత్రాన్ని అనౌన్స్ చేశాడు.దర్శకుడు గోపీచంద్ మలినేనితో బాలయ్య గతంలో 'వీరసింహారెడ్డి' చిత్రాన్ని రూపొందించారు. ఇక ఇప్పుడు మరోసారి ఈ కాంబోలో సినిమా రానున్నట్లు ప్రకటించారు. అయితే, ఈ సినిమా టెక్నికల్ డిపార్ట్‌మెంట్‌లో ప్రముఖ కన్నడ డీఓపి అరవింద్ కశ్యప్ వర్క్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. అరవింద్ కశ్యప్ కన్నడలో 777 ఛార్లీ, కాంతార వంటి సినిమాలకు సినిమాటోగ్రఫీ అందించారు.ఇప్పుడు బాలయ్య సినిమాకు ఆయన సినిమాటోగ్రఫీ అందించనుండటంతో ఈ సినిమాలో ఎలాంటి విజువల్స్ ఉండబోతున్నాయా అని అభిమానులు ఆసక్తిగా చూస్తున్నారు. ఇక ఈ సినిమాను వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీశ్ కిలారు ప్రొడ్యూస్ చేయనున్నారు.




# రెడ్ డ్రెస్‌లో ప్రియాంక హాట్ లుక్

చిన్నా, పెద్ద అన్న తేడా లేకుండా అందరికీ నచ్చే పండుగల్లో దీపావళి ముందు వరుసలో ఉంటుంది. పండుగకు పది రోజుల ముందే ప్రజలు వేడుకలను మొదలు పెట్టేస్తారు. ఇక సినీ తారలైతే పార్టీలు, వేడుకలంటూ సందడి చేస్తుంటారు. రోజుకో చోట పార్టీలు చేసుకుంటూ ఎంజాయ్ చేస్తుంటారు. తాజాగా హాలీవుడ్‌లో సెటిల్ అయిన బాలీవుడ్ నటి, గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కూడా దివాళీ వేడుకలను ఘనంగా జరుపుకుంటున్నారు.గ్లోబల్ స్టార్ తాజాగా లండన్‌లో జరిగిన దివాళి బాల్‌కు హాజరై సందడి చేశారు. ఎరుపు రంగు గౌను ధరించి హాట్ లుక్‌లో అందరినీ ఆకర్షించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను పీసీ తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఏడాదిలో తనకు ఎందో ఇష్టమైన రోజు, ప్రపంచంలోనే తనకు ఇష్టమైన నగరాల్లో ఒకటి.. అంటూ ఆ ఫొటోలకు క్యాప్షన్ రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ ఫొటోలు వైరల్ అవుతున్నాయి. కాగా, గతేడాది కూడా ప్రియాంక చోప్రా లండన్‌లో దివాళీ పార్టీలో మెరిసిన పోయిన విషయం తెలిసిందే. ఆ సమయంలో సబ్యసాచి డిజైన్ చేసిన రెడ్ శారీలో పీసీ ఎంతో అందంగా కనిపించారు.



# మానవాళి భవిష్యత్తుకు స్త్రీ మూలస్తంభం

మిమీ' చిత్రంతో జాతీయ ఉత్తమనటిగా కేంద్ర ప్రభుత్వ పురాస్కారాన్ని అందుకున్న బాలీవుడ్ భామ కృతి సనన్ తాజాగా ఓ అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకున్నారు. బెర్లిన్‌లో నిర్వహించిన 'వరల్డ్ హెల్త్ సమ్మిట్-2025'లో ప్రసంగించిన తొలి భారతీయ నటిగా కృతిసనన్ నిలిచారు. ఇది తనకు లభించిన గొప్ప గౌరవమని కృతి ఆనందాన్ని వెలిబుచ్చారు. ఈ వేదిక పై ఆమె మాట్లాడుతూ 'ప్రపంచ జనాభాలో దాదాపు సగం మంది మహిళలే ఉన్నప్పటికీ వారి వైద్యానికి కావాల్సినన్ని వనరులు ఉండటం లేదు. స్త్రీల ఆరోగ్యంపై దృష్టి సారించాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉంది.ఇది తేలికైన అంశం కాదు. మానవాళి భవిష్యత్తుకు స్త్రీ మూలస్తంభం అని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి.' అంటూ ఆవేశంగా మాట్లాడారు కృతి సనన్. ఇక ఆమె నటిస్తున్న సినిమాల విషయానికొస్తే.. కోలీవుడ్ హీరో ధనుష్ కథానాయకుడిగా రూపొందుతున్న బాలీవుడ్ ప్రేమకథ 'తేరే ఇష్క్ మే'లో ఆమె కథానాయికగా నటిస్తున్నారు. నవంబర్ 28న ఈ సినిమా విడుదల కానున్నది. అలాగే షాహిద్ కపూర్‌తో కలిసి 'కాక్‌టెయిల్ 2'లో కూడా ఆమె నటిస్తున్నారు.




# ఈసారి అంచనా తప్పదు!

సినీ ప్రయాణాన్ని తాను పరిపూర్ణంగా ఆస్వాదిస్తున్నానని, జయపజయాల గురించి ఆలోచించకుండా నటిగా పరిణితి చెందడంపైనే దృష్టి పెట్టానని చెప్పింది పూజాహెగ్డే. దక్షిణాదిలో అగ్రనాయికగా పేరు తెచ్చుకున్న ఈ భామకు గత కొన్నేళ్లుగా వరుస పరాజయాలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో కెరీర్ కమ్‌బ్యాక్ సినిమా కోసం ఎదురుచూస్తున్నది. ప్రస్తుతం ఆమె చేతిలో జననాయగన్, కాంచన -4 వంటి భారీ ప్రాజెక్ట్‌లున్నాయి. ఇటీవలే పూజాహెగ్డే పుట్టినరోజుని జరుపుకుంది. ఈ సందర్భంగా ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో కెరీర్‌పై ధీమా వ్యక్తం చేసిందికెరీర్ ఆరంభంలోనే పరాజయాలు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొన్నానని, ఆ తర్వాత వరుస విజయాలతో స్టార్‌డమ్‌ను సంపాదించుకున్నానని చెప్పింది. 'ఒక్కోసారి మనం ఎన్ని ప్రయత్నాలు చేసినా విజయాలు దక్కవు. అయితే ఫెయిల్యూర్స్‌కి నేనెప్పుడూ కుంగిపోను. ప్రస్తుతం చేస్తున్న సినిమాలపై గట్టి నమ్మకంతో ఉన్నాను. ఈసారి మాత్రం నా అంచనాలు తప్పవు. మళ్లీ తిరిగి పూర్వ వైభవాన్ని సాధిస్తానని నమ్మకం ఉంది' అని చెప్పింది.

# చిన్నతనంలో అలా.. ఇప్పుడిలా

సౌత్ ఇండస్ట్రీలో తన అందం, అభినయంతో ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న నటి రెజీనా కసాండ్రా మరోసారి వార్తల్లో నిలిచింది. ఇటీవల ఆమె తన వ్యక్తిగత జీవితం, ముఖ్యంగా మత మార్పిడి గురించి ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. 1990 డిసెంబర్ 13న చెన్నైలో జన్మించిన రెజీనా, కేవలం 9 ఏళ్ల వయసులోనే పిల్లల టీవీ ఛానల్‌లో యాంకర్‌గా తన కెరీర్ ప్రారంభించింది. తన ముద్దుముద్దు మాటలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆమె, చిన్నతనంలోనే కళారంగం పై ఆసక్తి చూపింది. 14 ఏళ్ల వయసులో నటుడు ప్రసన్న, లైలా జంటగా నటించిన తమిళ చిత్రం 'కంద నాన్ మూ' లో లైలా చెల్లెలుగా నటించింది. తమిళం, తెలుగు, హిందీ భాషల్లో పలు సినిమాలు చేసిన రెజీనా, తెలుగులో ప్రత్యేకమైన ఫ్యాన్‌బేస్ సంపాదించింది. 'సుబ్రహ్మణ్యం ఫర్ సేల్', 'ఈనాడు', 'అవును 2', 'ఏక్ లడ్కీ కో దేఖా తో ఐసా లగా' వంటి సినిమాల ద్వారా తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో రెజీనా మాట్లాడుతూ తన మత మార్పు గురించి ఓపెన్‌గా చెప్పింది. "నా నాన్న ముస్లిం, అమ్మ క్రిస్టియన్. ఇద్దరూ ప్రేమ వివాహం చేసుకున్నారు. చిన్నతనంలో నేను ముస్లింగా పెరిగాను. ఆ తర్వాత, ఆరు సంవత్సరాల వయసులో క్రిస్టియన్‌గా మారిపోయాను." అని ఆమె వెల్లడించింది.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No - APTEL/2010/32877.